జీవితాలు అంకితం చేశారు కాబట్టి కాని, లేకపోతే రామరామ! అంతకష్టమైనపనికి ఎవ్వరూ పూనుకోరనీ చెప్పి మనలను నమ్మమంటారు. సినిమాతారలుగూడా—కొందరు తాము పొరపాటున సినిమారంగంలో ప్రవేశించామనీ—అది అనుకున్నంత బాగావుండదనీ - కాని యేదో ప్రవేశించాము గనుక తిరిగిరావటం కష్టమనీ చెప్తారు. వుద్యోగస్థులకు రైతుల జీవితములోని స్వేచ్ఛంటే చాలాయిష్టము. రైతులకు వుద్యోగస్థుల జీవితాలుచూస్తే చాలాయిష్టం. కాని ప్రతివాళ్ళూ తమ వృత్తి బాగులేదంటారు- గమనించదగ్గ విషయ మేమిటంటే-వాళ్ళు తమ వృత్తులను మాత్రము అంటిపెట్టుకునే వుంటారు.

మానవులలో అవిశ్వాసము పెరిగింది. అసలు విశ్వసించదగ్గ వస్తువులు రెండేవున్నాయి. ముసలికుక్క, ముసలిభార్య- యివైనా తమకేమీ యితర ఆధారాలులేవు గాబట్టి. కాని లోకములో యిన్ని పరస్పర విరుద్ధాలైన విషయాలున్నా తృప్తినిచ్చేది యేమిటంటే - మనం యిష్టమొచ్చినట్టు మనము వూహించుకోవచ్చు. మన ఆలోచనలు మనవిమాత్రమే, యింకెవ్వరికీ తెలియవు. మనం యెటువంటి ఆలోచనలూ, యితరులను గురించి యెలాంటి దురభిప్రాయాలు కలిగివున్నా మనము పెద్దమనుషులలాగా చలామణీ అవుతున్నామంటే కారణము మన ఆలోచనలన్నీ మనస్వంతాలు కాబట్టే; యితరులకు తెలియకపోవటము వలననే. లేకపోతే అవన్నీ విచారణకు పెట్టే నిజంగా జీవితంలో పదిసార్లు కాదు—రోజుకు కనీసము ఒకసారైనా మరణశిక్ష విధించాల్సి వస్తుందేమో! కాదనగలరా? మీరు కాదనిచెప్పినప్పటికీ నన్ను వంచించగలరుగాని మీ ఆత్మను వంచించగలరా?

---

స్కెచ్

# ఊగే పెండ్యులం

నిట్టల శ్రీరామమూర్తి

నేనూ శాస్త్రీ, శర్మా లోకాభిరామాయణం మాట్లాడుకుంటూంటే శాస్త్రి చటుక్కున ఓసారి రిస్టువాచీకేసిచూసి "అబ్బా అప్పుడే ఆరు గంటలయిందే? వెళ్ళొస్తాన్రా" అంటూ లేచి గబగబ వెళ్ళిపోయాడు. ఆశ్చర్యంగా ప్రశ్నించే నా కళ్లుచూసి శర్మ సంజాయిషీఇచ్చేడు "కాస్త చీకటి పడితే శ్రీమతి శాస్త్రీకి భయమేస్తుందిట." నేను నమ్మలేకపోయాను. శాస్త్రిమిటి అంతసాహసం చేయటం ఏమిటని. వివరాలు సెలవిచ్చాడు శర్మ.

మునపటి శాస్త్రికీ, ఇప్పటి శాస్త్రికీ పోలిక లేదు. ఇప్పుడు ఆయనగారికి శ్రీమతి ఎంతచెప్తే అంత. ఎంత కొంపలుమునిగే ఎంగేజిమెంట్లున్నా సరే సాయంత్రం "ఆరూ" అయేసరికి ఇంటికి వెళ్ళిపోతాడు. పైగా తన భార్యకుభయమనీ, ఒక్కర్తీ వుండలేదనీకూడా ఎదుటివాళ్ళతో నిస్సంకోచంగా చెప్తాడు. ఏ ప్రశంసవచ్చినా "మా ఆవిడకి 'ఇది' ఇష్టం, మా ఆవిడ 'ఇలా' చేస్తుంది, 'అది' ఎప్పుడూ [illegible] కనపడలేదు" అంటూ ఆవిడగురించే చెపాడు ప్రపంచంలో అందరికీ ఆవిడగారి విషయమే కావల్సి వచ్చినట్టు. అతనిపైన ఆవిడకున్న ప్రభావం అమెరికాలో ఐసెన్‌హోవరికి కూడా వుండివుండదు. ఆఖరికి పెళ్ళికొడుక్కికూడా వుండదు భార్యపైన అల్లాంటి మోజు. అవతలవాళ్ళేమనా అనుకుంటారేమో అనే ఆలోచనకూడా లేదు అతనికి- అల్లాంటిమోజులో పడ్డాడు.

శాస్త్రి అల్లా అయ్యాడంటే మామూలు వాళ్ళకి అంతగా అనిపించదు. వెటకారంగా, పరిహాసంగా ఓ నవ్వునవ్వి వూరుకుంటారు. కాని శాస్త్రిని మొదటినుంచీ ఎరిగున్న నాకు, నేను ఈ వూరినుంచి బదిలీఅయి తిరిగివచ్చిన ఈ ఆరునెలల్లోనే ఇంతగా మారిపోయాడంటే నాకు ఎంతో విచిత్రంగానూ, విపరీతంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించటం సహజం.

ఆ రోజుల్లో నేనూ శాస్త్రీ చెంగల్రాయుడి కొట్టల్లో ప్రక్కపక్క వాటాల్లో వుండేవాళ్లం. ఒకే ఆఫీసులో గుమాస్తాలుగా పని చేశాం.

శాస్త్రికి ఎప్పుడూ ముక్కుచివర వుండేది కోపం. అతనంటే ఇంట్లో అందరూ అగ్గగ్గలాడేవారు. అతనితో మాట్లాడ్డానికి అందరికీ భయమే. ఆఫీసరుచేసే అవకతవకలకి తనలో కోపాన్ని బలవంతాన్ని అణచుకుంటూ, తనముక్కు ఎర్రబడి, ముఖం కందగడ్డయి ముక్కు కోణాలు పెద్దవిచేసి పైకి చిత్తం చిత్తం అంటూ ఆఫీసర్ని తప్పనిసరిగా సమర్థించే శాస్త్రిని చూస్తూంటే నాకు ఎంతో నవ్వువచ్చేది. 'లా' అనే అడ్డులేకపోతే ఆ ఆఫీసర్ని శాస్త్రి ఏంచేసివుండేవాడో మనం వూహాకి వదిలేద్దాం. కాని ఆ అక్కసు అంతా ఇంట్లోవాళ్ళ మీద పొంగిపొర్లేది.

ఆ రోజు నాకింకా జ్ఞాపకంవుంది. ఆఫీసులో ఫెయిరుకాపీలు టైముకి తయారుచేసి ఇవ్వలేదని ఆఫీసరు చీవాట్లు వేసేడు. సాయంత్రం ఆరింటిదాకా ఆఫీసులోనే పని రద్దీలో వుండిపోయాడు శాస్త్రి. అసలే మండిపోతూన్న శాస్త్రికి ఇంటికి రాగానే ఎవరూ లేకపోవటం మహా ప్రళయంగా పరిణమించింది. మరో నిమిషంలో ఆవిడ రానే వచ్చింది.

"ఎక్కడికెళ్ళావ్? అస్తమానం వాళ్ళింటికీ వాళ్ళింటికీ పెత్తనాలెందుకు వెధవ్వేషాలాని" అంటూ విరుచుకుబడ్డాడు. ఆవిడ హడలిపోతూ, "సీతమ్మగారింటికి కాస్త నెయ్యి అప్పు తేవడానికి వెళ్ళానండీ" అన్నది.

"ఓహో అప్పులుకూడానా? ఎప్పుడూ అప్పుకోసం ఎవరింటికీ వెళ్ళొద్దని చెప్పలా" అన్న శాస్త్రి మాటలూ, చరుపుల చప్పుడూ, ఆవిడ ఏడుపూ వినిపించేయి. నేతిడబ్బులకి టికాణాలేని శాస్త్రికి ఏ అప్పూ చేయకుండా పూట ఎల్లాగడుస్తుందీ అన్న ఆలోచనే లేకపోయింది.

"ఊఁ త్వరగా వడ్డించు వీధిలోకెళ్ళాలి" అంటూ భోజనప్రయత్నంలో పడ్డాడుశాస్త్రి. ఇంట్లోవాళ్ళ అవసరాలూ, వాళ్ళసుఖం చూడకుండా తన ఆఫీసేమిటో తనపనేమిటో అంతా స్వార్థంతో మునిగిపోయి నీచంగా ప్రవర్తించే శాస్త్రినిచూస్తే నాకు చాలా కోపం వచ్చింది అతను ఎంత స్నేహితుడైనా.

ఆవాళ ఆవిడ పుట్టినరోజు. ఇంట్లో ఎవరికీ తెలీదు. అవును ఎలా తెలుస్తుంది? ఆవిడ ఎలా చెప్పగలదు? అంతా సాహసమే? కాని పుట్టినరోజు పండుగ బాగానే జరిగింది. పప్పులో వుప్పు ఎక్కువైందిట. 'ఇన్నేళ్ళొచ్చాయి, వంటొండడమేనా చాతకాదు' అంటూ దుబుక్కున వుమ్మేసి, కంచంలో చెయ్యికడుక్కుని సగంలో లేచిపోయి చర్రుమంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు శాస్త్రి. ఆ రోజు ఆవిడ భోంచెయ్యలేదు.

అల్లాంటిశాస్త్రి ఇల్లా పిల్లిఅయిపోయాడంటే నేను ఎల్లానమ్మడం? అంతటి శాస్త్రిని ఇస్త్రీచేసిన స్త్రీ అతనిభార్య కావటం ఎంతవిచిత్రం!

మర్నాడు ఆదివారంకదా అని వాళ్ళింటికి వెళ్ళేను. ఇద్దరూ ఆప్యాయంగా నన్ను ఆహ్వానించేరు. ఇదివరకు ఎదుటి మగవాళ్ళకు కనబడితే చాలు అగ్గిరాముడై పోయే శాస్త్రి ఆవిడ ఇవతలకువచ్చినా ఏమీ అనలేదు. ఇద్దరం పాతకబుర్లు చెప్పుకున్నాం ఆవిడ ఇచ్చిన కాఫీతాగుతూ.

"దానికి తీపి అంటే అసలు పట్టదురా. పంచదార వుందాలేదా అన్నట్లు అతికొంచెం వేసుకొంటుంది. నాకు పంచదార అధమం మూడు చంచాలేనా కావాలి. దాని అలవాటు చొప్పున కలిపేసినట్లుంది" అని "ఏమేవ్, కాస్త పంచదార తీసుకురా" అన్నాడు శాస్త్రి నెమ్మదిగా. అదే పాతరోజుల్లో అయితే శాస్త్రి కోపంతో ముక్కు కోణాలు పెద్దవి చెయ్యటం, గుడ్లు వురమటం, కాఫీకప్పు విసరి పారెయ్యటం ఆవిడ గజగజలాడుతూ వంటింట్లోకి పలాయనం కావటమూ అంతా లీలగా ఓ సినిమాలాగానే నా వూహలో కనిపించి మాయమైంది. ఇంతలో కెవ్వుమని కేక వినిపించింది ఎ.ఆర్.పి. సైరను స్థాయిలో. గబుక్కున కాల్లో పల్లేరుకాయ గుచ్చుకున్నట్లు తుళ్ళిపడి లేచి శాస్త్రి లోపలికి పరుగెత్తాడు. వెంటనే కొన్ని క్షణాలపాటు హాయిహాయిమని వినిపించి క్రమంగా కూనిరాగమూ, గిలకఆడించే చప్పుడూ జతపడి చివరకి చంటిపిల్లాడిని చంకనేసుకుని తయారయ్యాడు శాస్త్రి మరి కాస్సేపటి వరకూ నేను అక్కడ వున్నాననే సంగతే మర్చిపోయాడు. నేనుకూడా ఏదో గోడమీది కాలండరు లాగానో, దండెంమీది తువ్వాలు లాగో, బల్లమీది కలంలాగో ఏదోగదిలోని అలం

కారంగా అనిపించి వుండవచ్చు అతనికి. కాస్సే పటికి స్పృహలోనికి వచ్చి, "అది మడిగట్టుకుందిలే అంచేత ప్రస్తుతం ఈ దొరగారి డ్యూటీ మనది" అంటూ కూనిరాగాలు మొదలెట్టేడు కుర్చీలో కూర్చుని పిల్లాడిని తొడలమీద పడుకోబెట్టి కాళ్లు వూపుతూ.

వెళ్ళబోతూ అన్నాను, "ఒరేయ్ శాస్త్రి నీకు కోపం రాకుండా వుంటే ఓమాట అడుగుతాను చెప్తావా?"

"ఓ అదేంత మాట కోపమెందుకురా భాయ్! ఏమిటో అడుగు, తప్పకుండా చెప్తాను" అన్నాడు కాళ్లు అడ్డంగా వూపుతూ, వాడి ముక్కు శోణాలు పెద్దవి కాకుండా మామూలు సైజులో వుండటం గమనించి ధైర్యంచేసి అడిగాను.

"ఈ మార్పు ఎట్లా వచ్చింది?"

నిద్రపోతూన్న బిడ్డకి శాస్త్రిగారి కూనిరాగాలకి జోహార్! మళ్ళీ ఉయ్యాల్లో పడుకోబెట్టి వచ్చి, సీరియస్ మోహంతో చెప్పడం మొదలెట్టేడు.

"అవి నాకు జబ్బు దినాలు. నేను టైఫాయిడ్‌తో రోజుకిరోజులు మంచంమీదవున్నాను. ఎంతో శ్రమతో నిద్రాహారాలు లేకుండా నాకు సేవచేసింది. నా కనిపించింది. దాన్ని కొట్టడానికి నాకు అధికారం ఎక్కడిది? భర్త అయినంత మాత్రాన దాన్ని దాసీదానికంటే కూడా కనికష్టంగా చూసే అధికారం నాకు ఎవరిచ్చారు? ఎదురు చెప్పలేక నిస్సహాయంతో నావల్ల బాధ అనుభవిస్తూనే నా మేలు ప్రేమల్నీ కోరేదాని అమాయికపు మొహం నన్ను కలవరపెట్టింది. అప్పుడే నేను అనుకున్నాను. ఒకరిని కొట్టడానికిగాని తిట్టడానికిగాని ఇంకొకరికి హక్కు లేదనీ, (భార్యా భర్తలైనాసరే, అన్నదమ్ములైనాగాని, తండ్రీ కొడుకులైననూ) ఏ పనేనా ప్రేమతో అభిమానంతో చేయించుకోవాలనీ. ఆ రోజు 'ఆవారా' ఫిల్ము చూసి రాత్రి పది గంటలకి ఇంటికి తిరిగి వస్తూంటే నా మనస్సులో ఆ ఫిల్ములోని ప్రేమఘట్టాలు ఏవో కొత్త వూహల్నీ ఏవేవో కొత్తకోరికల్నీ రేకెత్తించేయి. ఆ మర్నాటి నించీ నా జీవితంలో నూతన అధ్యాయం మొదలెట్టింది. అన్నిటికంటే ఎక్కువ మాబోటూగాడు. వీడు ఆవిణ్ణి నాకు మరీ సన్నిహితురాల్ని చేశాడు."

గతస్మృతుల్లో గంభీరమైన ఆలోచనలో పడ్డాడు శాస్త్రి. శాస్త్రి మనస్తత్వాన్ని నాలోనే విశ్లేషించుకుంటున్నాను. గడియారం అరగంటకొట్టి మమ్మల్ని మేలుకొల్పింది. శాస్త్రిదగ్గర సెలవు తీసుకుని బయటికి వచ్చాను. గడియారం పెండ్యులము ఈ వైపునుంచి ఆవైపు వూగింది. రెండు మితిమీరిన గట్లలో వూగిసలాడే శాస్త్రి జీవితం జ్ఞాపకం వచ్చింది. పెండ్యులం ఆగి సమాన వూపులో నిల్చింది. ఆవిడ మంచితనం తెల్సిన నాకు శాస్త్రిజీవితంకూడా 'అతి'ని వదిలి సమాన స్థాయిలో నిలుస్తుందనిపించింది. కాలం సాగిపోతోంది...

ఇంకొన్నాళ్ళకి మళ్ళీ శాస్త్రిని కల్సుకోవటం తటస్థించింది. ఈసారి సైకిల్‌రిక్షాలో శాస్త్రీ, ఆవిడా, ఆవిడ ఒడిలో పిల్లాడూ (జూనియర్ శాస్త్రి) సినిమాకిలావుంది వెళ్తున్నారు. అంతకు ముందు పరిపాటయినట్లు శాస్త్రి పిల్లాడిని ఒడిలో పెట్టుకొని పాలసీసా పట్టుతున్నట్లు గాకుండా, నన్ను గుర్తించి పలకరించే ధోరణిలో నవ్వు మొహం పెట్టి చెయ్యివూపాడు శాస్త్రి. కుదుటబడిన మనస్సుతో శర్మ ఇంటికి మళ్ళాను.

---

అందాలరాణి అని పేరుబడ్డ ఒక సినిమాతార తను నటించిన సరికొత్త ఫిల్ము రషెస్ చూసి చాలా బాధపడింది. వెనక తను నటించిన "దేవకన్య"లో ఉన్నంత అందంగా యిప్పుడు యీ ఫిల్ములో లేదు. కెమెరామాన్‌ని పిలిచి అడిగింది: "రెండింటికీ ఫొటోగ్రఫీ మీదేగదః నటించింది నేనేగదః దేవకన్యలో ఉన్నంత బాగా ఇందులో లేనేం?"అని.

కెమెరామాన్ చిరునవ్వుతూ అన్నాడు: "చిట్టితల్లీః పదేళ్లకిందట నేను యింతకంటె పడుచువాణ్ణిః"